



'క్రధీతో మిలేగీ. కహీఁతో మిలేగీ' కూనిరాగం ఠక్కున ఆగిపోయింది. క్రాఫింగుని నొక్కులు నొక్కులుగా సరదానికి అరగంటనుంచీ అద్దంముందు అవస్థపడుతున్న గోపాలం అద్దంలో కనిపించిన వాసు మొహం చూసి కూని రాగం ఆపేసి వెనక్కు తిరిగేడు. వాసుచేతితో ఉత్తరం పట్టుకుని ఆముదం తాగిన ముఖం పెట్టుకుని మంచం మీద కూర్చునున్నాడు.

"ఏరా! వాసూ! సంగతులేమిటి? మీ నాన్న డబ్బు పంపనన్నాడా? పెళ్ళికూతుర్ని చూసేను రమ్మన్నాడా? ఈ సెలవలికి కూడా ఇంటికి రాపోతే డొక్క చీరేస్తా నన్నాడా? తన ఊహకందిన కారణాలన్నీ ప్రశ్నలరూపంలో ఏకరువు పెట్టి మళ్ళా క్రాపింగు సద్దు కుందుకు తిరగ బోయేడు గోపాలం.

వాసు గొల్లున ఏడ్చినంత పనిజేసి, "నాకూ మన హాస్టలుకు రుణం తీరిపోయిందిరా గోపాలం. సినిమాలకీ; పిక్నిక్‌లకీ ఇక గుడ్ బై చెప్పాలిరా. పాలం! ఇహా కాలేజీ ఎగ్గొటి తిరగ డానికి అసలే నీలుండదురా.... లం.!" అన్నాడుకారే కన్నీటిని గోపీరుమాలుతో తుడుచు కోడానికి ప్రయత్నిస్తూ.

జరుగ బోయే ప్రమాదాన్ని ముందే గుర్తించిన గోపాలం వాసుకి రెండడుగుల దూరంలో జాగ్రత్తగానిల్చుని జేబులోని కొత్తరుమాలుని ప్రేమగా చూసుకుంటూ " అసలుకారణం చెప్పేడవరా!

నా తండ్రీ, అంటూ ముద్దుముద్దుగా తిట్టేడు,

దుఃఖాన్ని దిగమ్రింగుకొని," మా నాన్నగారు ఈ ఊరిలో కాపరం పెడతారట్రా. కా....ప....రం.... నిన్నొక్కళ్ళి ఒక్కిల్లు చూసి ఉంచమని రాసేర్రా ఎల్లుండే వస్తారట" అన్నాడు వాసు అతికష్టం మీద.

మొగాడ్ మీ నాన్నగారే! ఇక్కడే! కాపరమే! పెట్టడమే! నువ్వే! ఇల్లే! చూడడమే!!! ముక్కముక్కకీ ఆశ్చర్యపోతూ అన్నాడు గోపాలం.

"అవునురా! అన్నాడు వాసు దుఃఖం కాస్త ఉపశమించేక.

గోపాలం ఇప్పుడు కూడా రాబోయే ప్రమాదాన్ని గ్రహించేడు, ఇప్పుడు వాసు ఇళ్ళ వేటకి తనని రమ్మంటాడు, అందుకని క్రాపుని గబాకబా చేతిలోనే ఎలాగో ఓలాగ సద్దేసి బయట పడబోయేడు. కానీ పాపం ఈ సారి తప్పించుకో లేక పోయేడు. వాసు చటుక్కున గోపాలం చేతులు పట్టుకుని," ఇవి చేతులు కావురా! కాళ్ళురా! అంటే నువ్వు జంతువువి కావులేరా! నిజంగా! నా తండ్రివి కదూ! నా బాబువి కదూ! నీకొక సినిమా చూపించి క్వాలిటీలో పార్టీ ఇస్తాగదరా," అంటూ ప్రతిమాలడం మొదలెట్టేడు

ఆఖరి కెలాగైతేనేం గోపి మెత్తబడ్డాడు. "నువ్వొప్పుకున్న ఆ ఫీజుకి ఇవాళొక్క రోజు సాయం వస్తా" అన్నాడు' వాసు అమ్మయ్య అని నిట్టూర్చేడు.

రూముకి తాళం వేసి ఊళ్ళోపడ్డారిద్దరూ ఇద్దరికీ ఒక మూల భయంగానే ఉంది, ఈ విశాఖపట్టణంలో ఎలా వెతకడము? అని

ముందుగా తన ఫ్రెండ్స్ కొందరి ఇళ్ళకి వెళ్ళేరు అక్కడ గూడా ఇంట్లో లేరు. అప్పుడు మరి సాయంకాలం ఇంట్లో కూర్చోడం అబ్బాయిలకు ఫ్యాషను కాదుగా! సర్లే మన ప్రయత్నం కాస్త మనం చేద్దాం అనుకుని ఒకవీధిలో కాస్త బొప్పున్న ఇంట్లోకి జొరబడ్డారిద్దరూ.

ఒక నడివయసాయన వసారాలో నిలబడి ఎవరిమీదో పెద్దగా కేకలేస్తున్నాడు ఆయన కేకలకు వీళ్ళిద్దరూ ఇంచుమించుగా ఝడుసుకున్నారు గూడా." ఇక్కడొద్దురా, మరోచోటికి పోదాం పద! అన్నాడు వాసు. వీళ్ళ మాటలకి ఇటుతిరిగిన ఆ ఆసామీ "ఎవరు మీరు ? ఎవరికోసం వచ్చేరు ? అని అడిగాడు.

కసిరినట్టుగా అడిగిన ఆ ప్రశ్నకి వాసు తత్తర పడుతూ జవాబిచ్చేడు "అద్దెకండీ" అని.

అంతే. ఆయన తారాజువ్వలా లేచాడు "విన్ననేగా మనిషి పట్టు కెళ్ళేడు. ఏం ఇవాళకూడా కావాల్సొచ్చిందేమిటి? ఆ కులాసా రాయుడికి? ఇల్లుకారిపోతోందయ్యా. ఒకసారి చూడంటే రాడు. గోడలూడి పోతున్నాయ్ సున్నాలేయించవయ్యా. అంటే వేయించడు. కాలువొకటి కట్టించేడున్వయ్యా దోమలతో చస్తున్నామంటే పట్టించికోడు నెలా అయ్యేసరికి అద్దెకిమాత్రం మనుషులను

పంపిస్తాడు. ఇలాటి ఇంట్లో మేం గాబట్టి ఉంటున్నాం, ఇంకెవరైనా అయితే ఉండగలరా. అంట, ఉండగలరటయ్యా? నువ్వు చెప్పు" కోపం ఎందుకు వచ్చిందో. మరిచిపోయి ఇంటిని వర్ణించి ఆయనా తన్నేట్లుగా ప్రశ్నిస్తుంటే బిక్కచచ్చిపోయిన వాసు "ఉహూ," అని తల మాత్రం ఊపేడు భయంగా.

కానీ విషయం చిక్కగానే గోపాలం మట్టుకు," అది కాదండీ! మేము ఏమైన వాటాలు ఖాళీగా ఉన్నాయేమోనని వచ్చేము" అన్నాడు వీలయినంత గబగబా ఆయన మళ్ళీ నోరెక్కడ విప్పుతాడోననే భయంతో.

మళ్ళా పైకి లేస్తున్న తన గొంతుని అతికష్టం మీద అదుపుకి తెచ్చుకున్న ఆయన కోపంగా," అలా చెప్పరాదూ మరి? అర్థంపర్థం లేకుండా మాట్లాడితే ఎల్లాగ? ఈ ఇంటాయన ఇక్కడుండడు లెండి. ఎవరేనా వస్తే ఆ వాటా చూపించమన్నాడు. ఒకగది. ఒక వంటిల్లూను. అద్దె ఏభై రూపాయలు" అన్నాడు.

ఇంటి గురించి ఆయన నోటినే విన్న వీళ్ళిద్దరూ ఆ వాటాని, అద్దెనీ చూసి "మా కొద్దండీ" అని పైకొచ్చారు.

గోపాలం, "ఒరే వాసూ! నీ సినిమాకొక దణ్ణంగానీ, నేపోతారా!" అన్నాడు.

వాసు ఏడుపుముఖం పెట్టి, "మా నాన్న చంపేస్తాడ్రా చెప్పిన పనిచెయ్యకపోతే. స్నేహితుడి కోసం ఈమాత్రం సాయం చెయ్యలేవురా?" అన్నాడు గోపాలం మాట్లాడకుండా విసుగ్గా వాసుని అనుసరించేడు.

అకస్మాత్తుగా 'To Let' అన్న బోర్డుని చూసినవాసు, తన తండ్రి తాను ప్రేమించిన పిల్లనే తీసుకొచ్చి పెళ్ళి చేసుకోమన్నంత సంబర పడుతూ గోపాలాన్ని తీసుకుని ఆయింట్లోకి ప్రవేశించేడు. హాల్లో ఆరుగు రమ్మాయిలు పేకాడుతున్నారు. వీళ్ళనుచూసి రెప్పలు వాల్చకుండా పై నుండి క్రిందిదాకా చూడడం మొదలెట్టారు. వీళ్ళిద్దరికీ వళ్ళంతా సూదులతో గుచ్చుతున్నట్లయి కంపరమెత్తింది.

ఆ అమ్మాయిల్లో నల్లగా తారు ముద్దలా, సన్నంగా వెదురు బద్దలా, పొడుగ్గా గంట స్థంభంలా ఉన్న ఒకమ్మాయి ఎంతో అందంగా ఒకపిచ్చి నవ్వునవ్వి. "ఆహా! ఆరుగురు దేవతా స్త్రీల మధ్యకి ఇద్దరు నరులు. సుందరులైన నరులు" అంది.

వైట్ పేపర్ కంటే తెల్లగా ఉండి పొట్టిగా మరుగుజ్జులా ఉన్న ఇంకొకమ్మాయి తన తెల్లటి పళ్ళుబైటపడేలా నవ్వింది. ఆఅమ్మాయితెలుపులో ఆపళ్ళు ఎక్కడున్నాయో కనిపించలేదు. కానీ ఆ అమ్మాయి పిల్లికళ్ళు మాత్రం లీలగా కనిపించేయి.

మిగతా అమ్మాయిలు ఎంత అవస్థ పడినా ముందుకు పడనంతటి చిన్నవిగా ఉన్న జడలనుముందుకు పడేసుకుందుకు ప్రయత్నిస్తూ తమకి తెలిసిన కొన్ని భంగిమలను ప్రదర్శించబోయేరు.

గోపాలం "వాసూ! వేగిరం పదరా! లేకపోతే ఇంకే అమ్మాయినైనా మన మీ

జన్మత్తి చూడడానికి భయపడతాం" అన్నారు

ఇంతలో ఆ అమ్మాయిల తండ్రి కాబోలు ఒక ముసలాయన అక్కడికి వచ్చి ఆ అమ్మాయిలతో, "మీరు లోపలికి పొండి" అన్నాడు. వాళ్ళు మూతి ముప్పై వంకరలు తిప్పి, వీళ్ళ దరివైపు వాలుచూపులు పారేసి లోపలికి వెళ్ళిపోయారు.

"ఏం లేదండీ! మాకు ఇల్లు అద్దెకు కావాలి. ఇక్కడ బోర్డుచూచి లోపలికి వచ్చేం కాని.... అక్కరలేదు లెండి" అన్నాడు గోపాలం.

"దానికా! మీరు స్టూడెంట్స్‌గా! ఆ పైన రెండు గదులూ తీసుకోండి. సామాను తెచ్చుకోండి. అద్దె తరవాత మాట్లాడుకుందాంలెండి" అన్నాడాయన

"మా కొద్దండీ! అయినా మాకు ఫామిలీకి కావాలి. రెండురూమ్స్ చాలవు" అంటూ ఇద్దరూ వెనుతిరిగేరు.

"ఫామిలీకా! మేము స్టూడెంట్సు కయితేనే యిస్తాము" అన్నాడు అరడజను మంది (పెళ్ళి కాని) అమ్మాయిలుగల ఆ ముసలాయన.

బయటి కొచ్చిన ఇద్దరూ వాంప్ చేతుల్లోంచి బయటపడ్డ హీరోల్లా 'అమ్మయ్య' అనుకున్నారు.

గోపాలం ఆవీధిలోనే కాస్త అందంగా పెద్దగా కనిపిస్తున్న ఇంట్లోకి దారితీసేడు. వసారాలో ఒకముసలాయన పడకుర్చీలో కళ్ళుమూసుకొని ఏదో గొణుకుతూ పడుకొని ఉన్నాడు. వాసు ఆయన దగ్గరికివెళ్ళి "ఏమండీ" అన్నాడు. ఆయన ఒక్కసారి అదిరిపడి, "సరే నన్నానా? మళ్ళా ఎందుకు వచ్చేవే?" అని వణుకుతూ కళ్ళిప్పేడు. "వీళ్ళద్దర్నీ చూడగానే "మాఆవిడను కున్నాను" అని కంగారును దాచుకుంటూ ఏం పని మీదొచ్చేరన్నట్టు చూసేడు.

"ఈ ఇంట్లో ఏమైనా వాటా లద్దెకిస్తారా?" అని అడిగేడు వాసు నవ్వు దాచుకొని.

"ఏమో బాబూ! దాన్నే అడగండి" అన్నాడాయన.

"రాయల్ సేవింగ్ స్కీమ్"
(పొదుపు సంస్థ)
వ. సీదుపందు — అరండల్ పేట — విజయవాడ-2
మా రాయల్ సేవింగ్ స్కీమునందు 8 వ ఫారం మొదలు ఎస్. ఎస్. ఎల్. సి. చదివిన యువతి, యువకులు ఏజంట్లుగా పనిచేయుటకు కావలెను.
ఇట్లు
మేనేజర్: షేక్

ఆయన 'దాన్ని' అని ఎవరిని ఉద్దేశించి అన్నాడో ఆవిడ రానే వచ్చింది. పెద్దగా అంటూ "ప్రతీదానికీ నన్నడగమంటారేం? అక్కడికి నేనేదో మీమీద అధికారం చెలాయిస్తున్నట్లు ఇంతకీ ఏంటి కావా లబ్బాయిలూ మీకు?"

వాసు నోరు విడనని మొండికేసింది. గోపాలం మట్టుకు, "ఇల్లు చాలా పెద్దది కదా! వాటాలేమైనా ఉన్నాయేమోనని.... అర్థోక్తిలోనే ఆవిడ మొహం చూసి ఆపేసేడు.

"ప్రతివారికీ ఈ ఇంటిమీదే కళ్ళు, పెద్దయిల్లు కట్టించుకున్నామని కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు. ఇటు చుట్టాలికీ బాదే అటు పరాయి వాళ్ళకీ బాదే. ఇల్లు పెద్దదయితే ఏం? మేముద్దెకివ్వం ఏం? ఇవ్వక పోతే ఏంచేస్తారేమిటి? మీరిక వెళ్ళొచ్చు" అంది. ఆ పాటికి వీళ్ళు ఇంటిని దాటి పదడుగుల దూరంలో ఉన్నారు

"ఇవాళ పొద్దున్నే ఎవరి మొహం చూసేం గోపాలం?" అన్నాడు వాసు

"ఏ సంగతి నాకు తెలియదుగానీ నేను మాత్రం నీ మొహమే చూసేను." అన్నాడు గోపాలం.

మరో చోటయితే మాటకి మాట అందించేవాడే వాసు. కాని ఇప్పుడు అవసరం తనది కనుక నోరుమూసుకు ఊరుకున్నాడు.

గోపాలం "ఇక ఈ వీధి లాభం లేదురా తంత్రీ. మనకి అచ్చిరాలేదు. అదీకాక పెద్దవాళ్ళున్న యింట్లోకి ఇంక వెళ్ళొద్దు. మనలాంటి అబ్బాయి ఉంటేనే వెడదాం" అన్నాడు.

మరోవీధి ప్రవేశించేక నాలుగిళ్ళు దాటేక ఒకింట్లో ఒకబ్బాయి పేపరు చదువుకుంటూ హాల్లో కూర్చుని కనబడ్డాడు. గోపాలం ముందుగా ఆయింట్లోకి వెళ్ళి "ఏమండీ! ఈ ఇంట్లోగాని, చుట్టుపట్లగాని ఏమైనా వాటాలు ఖాళీగా ఉన్నాయా?" అని ప్రాధేయ పూర్వకంగా అడిగినట్లడిగాడు. అతను వీళ్ళిద్దర్నీ ఎగాదిగా చూసి, "లేవండీ" అన్నాడు. ముఖాలు వేళ్ళాడేసుకుని ఇవతల పడ్డారిద్దరూ.

వీళ్ళ ముఖాలు చూసిన ఆ అబ్బాయికి ఏడిపించాలని బుద్ధిపుట్టినట్లుంది. ఇద్దర్నీ నాలుగయిదడుగులు వేయనిచ్చి చప్పట్లు చరిచి వెనక్కి పిల్చేడు. వీళ్ళెంతో ఆశతో వెనక్కి వచ్చేరు. బాగా దగ్గరకు రానిచ్చి "మా ఇంట్లో ఏమీ అద్దెకులేవండీ" అని దభాలున తలుపులు వేసేసేడు. ఇద్దరికీ కోపం వచ్చింది. చేసేదిలేక వెనక్కి తిరిగి కొంచెం నడిచేరు. వాసు "నువ్విక్కడే ఉండరా గోపీ" అని మళ్ళీ ఆయింటికివెళ్ళి తలుపులు విరిగిపోయేట్లు బాదేడు. ఇందాకటి అబ్బాయి భోజనం చేస్తున్నట్లుంది చెయ్యైనా కడుక్కోకుండా గాభరాగా వచ్చి తలుపు తీసేడు.

వాసు "మాకు మీ ఇంట్లో వాటా లున్నా అవసరం లేదండీ" అని తెల్లబోయిన అతడితో "మిష్టర్! మర్యాద నేర్చుకో" అని వెనక్కి తిరిగి వచ్చేసేడు. అతను వచ్చేదాకా ఆవీధి చివరి ఇంటి దగ్గర వేచియున్న గోపాలం, "ఒరే

వాసూ! ఇదిగో ఈ ఇల్లొక్కటీ అడిగేసి వెళ్ళిపోదాం. ఇక నువ్వు చచ్చిగీపెట్టినా రాను. నువ్వు ప్రామిస్ చేసిన ఫీజుకి పదింతలిచ్చినా ఇలాంటి వెధవ సాయానికి రాను." అన్నాడు.

వాసు "పోనేరా! చీకటిపడుతోంది గూడ ఈ ఒక్కటీ చూసి పోదాం. అదృష్టం బావులేకపోతే ఏంచేస్తాం? మొట్టమొదట చూసిన దోమల కొంపనే ప్రస్తుతానికి తీసుకుందాం" అన్నాడు

గోపాలం వెళ్ళి మూసివున్న ఆ ఇంటి తలుపుల్ని తట్టేడు. తలుపులు మెల్లగా తెరుచుకున్నాయి, ఒక పదహారేళ్ళ (గోపాలం దృష్టిలో అప్సరస లాంటి) అమ్మాయి మెల్లగా, "ఎవరండీ మీరు? ఏం కావాలి!" అంది.

'నువ్వే కావాలి' అనబోయి. నోరు విడక ఆ అమ్మాయిని చూస్తూ అలాగే ఉండిపోయేడు గోపాలం.

గోపాలం ఎంతకూ మాట్లాడకపోయేసరికి వాడి స్థితి గ్రహించిన వాసు మళ్ళా పాత పాటే పాడేడు "వాటాలున్నాయా" అంటూ.

ఆ అమ్మాయి "ఉన్నాయండీ? ఫామిలీకేనా?...." అంటూ ఏదో మాట్లాడబోయేంతలో ఏదో గర్జన వినిపించింది. దానితోపాటు తెల్లటి చీర, తల నిండా ముసుగు, చేతిలో భగవద్గీతతో బామ్మ ప్రత్యక్షమయింది. ఆ అమ్మాయి హడిలిపోయి. తెలివి తప్పబోయి, తమాయించుకుని కూలబడింది. క్రిందకాదులెండి కుర్చీలోనే.

"ఎవరయ్యా? మీరు? సంజచీకట్లో ఇంట్లోకి జొరబడి పెళ్ళికాని పిల్లతో మాట్లాడడానికి మీకు బుద్ధిలేదూ? మీలాంటి వాళ్ళను భగవంతుడు క్షమిస్తాడా? అంట. వెధవ కాలం మండిపోతోంది." అంటూ ఆవిడ కాలాన్ని గురించి వాపోతూ, వాసూ, గోపాలాల్నిద్దర్నీ అనేక విధాలుగా దీవిస్తూంటే ఆ బామ్మగారి దృష్టిలో తాము చేసింది క్షమించరాని అపరాధమనీ, కనుక ఇక్కడ వాటాలున్నా తమకవి అభ్యం కావనీ గ్రహించిన వాసు, అప్పటికే ఈ లోకంలోకి రాని గోపాలాన్ని గబగబా ఈడ్చుకుని వీధిలో పడ్డాడు, ఆతొందరలో దారిలో పోతున్నది ఒకాయనని గుద్దేసేడు.

ఆయన "ఏంబాబూ! కళ్ళు కనిపించటంలేదా?" అన్నాడు.

అప్పటికి ఈ లోకంలోకి వచ్చిన గోపాలం "ఆదెవరో అనట్లు మాకళ్ళు మాకెలా కనిపిస్తాయండీ?" అన్నాడు. వాసు గోపాలం నోరు నొక్కి, ఆయనని క్షమాపణ చెప్పుకుని. "ప్లీజ్ మీకేమైనా పోర్షను ఖాళీగా ఉన్నట్లు తెలిస్తే చెబుతారా?" అన్నాడు ఆఖరి ప్రయత్నంగా.

ఆయన వాసు ప్రవర్తనకి మురిసిపోయి. "దానికేంభాగ్యం? మా ఇంట్లోనే ఉంది ఒక ఫామిలీకి సరిపడే పోర్షన్ రండి చూపిస్తాను" అని తీసుకెళ్ళాడు.

ఆ పోర్షను వీళ్ళకు సరిపడిన విధంగా అన్ని సదుపాయాలతోనూ ఉంది. వాసు ఎడ్వాన్సు ఇచ్చి వాళ్ళను తాళం అడిగి వేసేడు. ఆ తంతు ముగిసేక వాసు ఎవరెస్టెక్కినంత సంబరంతోను, గోపాలం తను ఇందాక చూసిన అమ్మాయి తనను చూసి ప్రేమించి పెళ్ళాడినంత సంబరంతోను తిరుగు ముఖం పట్టేరు. ★